## చరిత్రకెక్కిన చరితార్థులు

# అమర గాయకుడు పద్మశ్రీ ఘంటశాల వెంకటేశ్వరరావు

- వాసంతి మాఘపు.



'యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత! అభ్యుత్థాన మధర్మస్య తదా౽త్మానం సృజామ్యహమ్' అని ఓ సుపరిచితమైన కంఠం ధ్వనిస్తుంటే బాహ్య ప్రపంచాన్ని మరచిపోయి అందులో లీనమైపోయానో క్షణం. మీరైనా అదే అనుభవాన్ని పొందుతారని నాకు నూరు శాతం నమ్మకం. ఆ కంఠం ఎవరిదని మీకు చెప్పనవసరము లేదు. ఆ కంఠం మరొక సందర్భములో 'ఉరులు దారాలతో గొంతుకురి బిగించి; గుండెలోనుండి సూదులు గ్రుచ్చి, కూర్చి; ముడుచుకొందురు ముచ్చట ముడులమమ్మ; అకటా దయలేని వారు మీ ఆడువారు' అంటూ పుష్పాలకు వకాలతా పుచ్చుకున్నా, 'లేచింది నిద్రలేచింది మహిళాలోకం దద్దరిల్లింది పురుషప్రపంచం' అని వాస్తవాన్ని కళ్ళముందుంచినా, 'కారులో షికారుకెళ్లే పాల బుగ్గల పసిడిదానా ... బుగ్గల గులాబి రంగు ఎలా వచ్చెనో చెప్పగలవా?' అని సూటిగా ప్రశ్నించినా, 'మాణిక్యవీణా' అంటూ దేవిని స్తుతించినా, 'తెలుగువీర లేవరా దీక్షబూని సాగరా' అంటూ విప్లవాగ్ని రగిల్చినా, 'నన్ను దోచుకుందువటె వన్నెల దొరసాని' అంటూ యుగళగీతం ఆలపించినా, 'కుడి ఎడమైతె పొరపాటు లేదోయ్' అంటూ వైరాగ్యాన్ని ఒలికించినా, 'పాడుతా తీయగా చల్లగ పసిపాపలా నిదురపో' అన్నా అది ఆ సన్నివేశానికి చక్కగా ఇమిడిపోయేటట్లు గానం చేయడం ఆయనకే చెల్లింది. యుగళగీతమైనా, భక్తి గీతమైనా, విరహగీతమైనా, జానపద గీతమైనా, విప్లవగీతమైనా, కరుణరస గీతమైనా ఆ భావము అతని గొంతులో తొణికిసలాడేదనడానికి 'పుష్పవిలాపము' విని తీరవలసిందే. చలనచిత్రంలో ఏ కథానాయకునికి గానం చేస్తే అతని కంఠమును అనుకరిస్తున్నట్లు పాడడము వలన, పాటవినగానే కథానాయకుడు ఎవరో చెప్పడం కూడా సాధ్యమయ్యేది. ఈ గాయకుని గురించి ఒకసారి గుర్తుచేసుకుందాం!

1922 వ సంవత్సరము డిశంబరు 4వ తేదీన జన్మించిన శ్రీ ఘంటశాల వెంకటేశ్వరరావు గారికి ప్రథమ గురువు మరియు స్ఫూర్తి ఆయన తండ్రి సూరయ్యగారు. ఘంటశాల గారు గుడివాడ దగ్గరలోని చౌటుపల్లి గ్రామంలో జన్మించారు. తండ్రి మృదంగవాద్యకారుడు మరియు గాయకుడు. ఘంటశాలగారి చిన్న తనముననే తండ్రి పరమపదించడము వలన వారి కుటుంబము మేనమామపై ఆధారపడవలసి వచ్చింది. సంగీతము నేర్చుకోవాలనే అతని కోరిక తీరేదిగా కనిపించలేదు. ఒకసారి అతను పాడుతుంటే,

ఎవరో ఆటపట్టించినపుడు, తను ఎలాగైనా సంగీతశిక్షణ పొంది, ఆటపట్టించిన వారి నోళ్ళు మూయించాలని దృఢముగా నిశ్చయించుకొన్నారట. తన చేతి ఉంగరము అమ్మి, ఆ పైకముతో సంగీత శిక్షణపొందేందుకు విజయనగరము మహరాజా సంగీత కళాశాలకు వెళ్ళడం జరిగింది. తీరా అక్కడికి వెళ్ళేసరికి కళాశాలకు వేసవి సెలవులు ప్రకటించడం జరిగింది. ఆ సమయంలో ఆయవారములు (రోజుకు ఒక గృహము నుండి, ఒకపూట మాత్రమే భోజనము చేయడం) చేసి, మధుకరములు (బ్రాహ్మణ విద్యార్థిగా యాచన చేయడము) చేసి కొంతకాలం గడిపాడు. ఆ సమయంలో ఘంటశాల గారికి 'అంధకారంలో మెఱుపుతీగె' లాగ శ్రీ పాత్రాయని సీతారామ శాస్త్రి గారి పరిచయం ఏర్పడి, ఆయన వద్ద శిక్షణ పొంది, తరువాత సంగీత కళాశాల ప్రధాన అధ్యాపకులు శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడుగారి సమక్షంలో గాత్ర పరీక్షలో నెగ్గి, ఆ కళాశాలలో విద్యార్థిగా ప్రవేశించారు. తద్వారా అక్కడి మహరాజా సత్రవులో ఉచితముగా భోజనము చేయడానికి అర్హత సంపాదించాడు. ఆ సమయంలో కూడా డబ్బులు చాలని స్థితిలో, ఆయన పెండ్లిండ్లలో శాస్త్రీయ సంగీతం పాడి శ్రోతలను పరవశింపజేసేవాడు. ఎక్కువగా అందులో భక్త రామదాసు కీర్తనలు చోటుచేసుకునేవి. ఇంకా దసరా, శ్రీరామనవమి, వినాయకచవితి ఉత్సవాలలో పాటలు పాడుతుండేవాడు.'కళావరు రింగ్'గా పేరుపడ్డ గాయని, (గ్రామఫోన్) రికార్డింగ్ కళాకారిణి, నర్తకి, హరికథా కళాకారిణి మరియు దాతృత్వమునకు పేరుపడ్డ ఎస్. లక్ష్మీ నరసమ్మగారు ఆయనని అవసరమైన సమయములో ఆదుకున్నారు. తరువాత ఆకాశవాణి ద్వారా ప్రసారమైనవి కూడా ఎక్కువగా శాస్త్రీయ సంగీతానికి సంబంధించిన పాటలే ఉండేవి.




ప్రభుత్వం విడుదల చేసిన ఘంటశాల తపాలాబిల్ల.

1941 వ సంవత్సరములో 'విద్వాన్' పట్టా పొందారు. 1942లో క్విట్ ఇండియా ఆందోళనలో పాల్గొని, 18 నెలలు జైలు శిక్షను కూడా అనుభవించాడు.పెదపులివర్రు వాస్తవ్యురాలైన సావిత్రిని వివాహము చేసుకున్నాడు. అదే గ్రామములో సముద్రాల రాఘవయ్యగారితో పరిచయం అతనిని మద్రాసు సినీ ప్రపంచనికి ఓ కళాకారుని అందజేసింది. శ్రీ ఘంటశాల నాగయ్యగారి త్యాగయ్య(1946), యోగి వేమన (1947) సినిమాలలోను, తరువాత కథానాయకి, గాయని, నిర్మాత అయిన సి. కృష్ణవేణి ద్వారా 'మనదేశం' సినిమాలో సంగీత దర్శకునిగాను, గాయకునిగాను, అనంతరం 'కీలుగుర్రం' సినిమాలో సంగీత దర్శకునిగాను మరియు గాయకునిగాను అవకాశములు రావడము మొదలు 1970 వరకు అతని ప్రస్థానము కొనసాగుతునే ఉంది. షావుకారు (1950), చిరంజీవులు (1956) , రహస్యం (1967)

ఆయనకు పేరు తెచ్చిన చిత్రాలలో కొన్ని. 1960 వ సంవత్సరములో 'శ్రీ వెంకటేశ్వర మహత్యం' సినిమాలో ఆయన నటించారు. 30 సంవత్సరాల క్రితం పాటలైనా నేటికీ ఎంతో ఆదరణకి నోచుకుంటున్నవంటే అది ఆయన ఆ పాటలో భావాన్ని, ప్రేమ, బాధ, విరహం, ఆనందం, భక్తి రసాలని నింపి అందించగలగడమే కారణం! 125 సినిమాలకు పైగా సంగీత దర్శకత్వం వహించి, 10 వేలకు పైగా పాటలను గానం చేసిన ఆయన మొట్టమొదటి నేపథ్యగాయకుడు. అతని ఏకైక విదేశీ ప్రయాణము న్యూయార్క్‌కు 1971 అక్టోబరు 8 నుండి నవంబరు 5 వరకు జరిగింది. ఈ సమయంలో ఆయన వాషింగ్టన్ డి.సి., లాస్ ఏంజల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో, డెట్రాయిట్, చికాగో, టొరాంటో, బోస్టన్ లను సందర్శించారు. యునైటెడ్ నేషన్స్ శాంతి పథకాన్ని కూడా పొందారు. అరుదైన తిరుమల తిరుపతి దేవస్థానము ఆస్థాన గాయక పదవిని అలంకరించారు. ఈయనకు పద్మశ్రీ పురస్కారము కూడా లభించింది. ఆయన పాడిన దేశభక్తి గీతములు, భక్తి పాటలు, పుష్పవిలాపం, కుంతికుమారి, పోలీసు వెంకటసామి పాటలు, అత్తాకోడలి పాటలు (అత్త లేని కోడలుత్తమురాలు ఓలెమ్మా!, కోడలు లేని అత్త గుణవంతురాలు!!), భగవద్గీత నేటికీ వినబడుతునే ఉన్నాయి. 1974 ఫిబ్రవరి 11వ తారీఖున ఆయన గళం మూగవోయింది.

ఘంటశాలగారికి ముందు ఎందరో గాయకులు వచ్చారు, నేటికి ఎందరో గాయకులు వస్తున్నారు. అయినా శ్రోతల హృదయాలలో ఆయన పొందిన స్థానం పదిలం. ఆయన అమరుడు. ఆయన గానం నిన్నటికి, నేటికి, ఎన్నటికీ మధురమే!

చరిత్ర కెక్కిన చరితార్థులు శీర్షికకు మీకు తెలిసిన నాయకుల గురించి మూడు లేదా నాలుగు పుటల వ్యాసాల్ని ఆహ్వానిస్తున్నాము. వ్యాసమును ఈ-మెయిల్ ద్వారా గాని లేదా తపాలా ఉత్తరము ద్వారా గాని క్రింది చిరునామాకు పంపవలసినదని మనవి.

**Editor,**
**Sanghamitra**
**12450 Lyric Ct.**
**St. Louis**
**MO 63146**
**susri@Sanghamitra.org**